క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధిలో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్స వమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేసి సాయం త్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వ హించారు. విశేషంగా హారతి అందించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీ స్సులు పొందారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గాయత్రి సన్నిధిలో భారీ అన్నసమారాధన



అన్న సమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగిం పు సందర్భంగా చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్ పంచముఖ గాయత్రీమాత ఆల యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం అమ్మవారికి విశేష అభిషే కాలు నిర్వహించారు. అనంతరం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్ని ధిలో గాయత్రీ హోమం ఘనంగా జరిగింది. కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు ప్రారంభించారు. 5 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, అధిక సం ఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 5 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యా లయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. 98వ వార్డు అడవివరంలో రోడ్డు ఆక్రమణపై, 94వ వార్డు బీసీ కాలనీలో కొండమీద నివాసా లకు తాగునీరు అందడం లేదని, వేపగుంట బీసీ కాలనీలో రోడ్డు స్థలాల ఆక్రమణలు, దొగ్గవానిపాలెంలో అక్రమ నిర్మాణం, 94వ వార్డు బీసీ కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావ తిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కా రానికి జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్ర మంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలున్నా.. ప్రయోజనం సున్నా



ఎన్టీపీసీ రహదారిలో చెట్ల మధ్యన వీధి దీపాలు

పరవాడ: వాడచీపురుపల్లి–ఊటగెడ్డ కూడలి వరకు ప్రయాణి కుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వీధి దీపాలు అలంకారప్రాయంగా మారాయి. వీధి దీపాలు వెలుగుతున్నా.. కటిక చీకటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రయాణికులు చెప్తున్నారు. ఈ రహదారిలో రూ.లక్షలు వెచ్చించి ఎన్టీపీసీ యాజమాన్యం వీధి లైట్లను ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉంది. కానీ రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లు పెరిగి పెద్దవి కావడంతో వీధి దీపాలకు అడ్డంకిగా మారాయి. వీటి వెలుగులు రోడ్డుపైకి రాకపోవ డంతో రహదారిలో చీకటి రాజ్యమేలులోంది. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైట్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్టీపీసీ యాజమాన్యాన్ని గ్రామీణ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

పడకేసిన బీబీఎన్ఎల్ సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందించాలనే లక్ష్యంతో భారత్ నెట్ ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని కేంద్రం 2021లో ప్రారంభించింది. ఈ బాధ్యతను భారత్ బ్రాడ్ బ్యాండ్ నిగమ్ లిమిటెడ్(బీబీఎన్ఎల్)కు అప్పగించింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పైలట్ ప్రాజెక్ట్ కింద సబ్బవరం మండలాన్ని ఎంపిక చేశారు. మండలంలోని దాదాపు అన్ని సచివాలయాలకూ బీబీఎన్ఎల్ సేవల్ని అనుసంధానించారు. కూటమి ప్రభుత్వం రాకతో వీటి నిర్వహణ మూలకు చేరింది. రూ.కోట్ల విలువైన ఇంటర్నెట్ పరికరాలు వృథాగా పడిఉన్నాయి.



గొటివాడ సమీపంలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణలో భాగంగా స్తంభాలు మార్చి, నిర్లక్ష్యంగా వదిలేసిన ఫైబర్ కేబుల్ వైర్లు



లగిశెట్టిపాలెం సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం కిందే ఫైబర్ కేబుల్

- గ్రామాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సేవల కోసం సబ్బవరంలో పైలట్ ప్రాజెక్ట్
- గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు బీబీఎన్ఎల్ సేవల అనుసంధానం
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన సేవలు, నిరుపయోగంగా పరికరాలు

సబ్బవరం: మారుమూల పల్లెలకు కూడా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందాలి. అదే లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన భారత్ నెట్ ప్రాజెక్టు నియోజకవర్గంలో మూలకు చేరింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన మండలాల్లో సబ్బవరం కూడా ఒకటి. విద్యుత్ సబ్ స్టేషన్ల నుంచి పంచాయతీ కార్యాలయాలకు ఫైబర్ కేబుళ్లు వేశారు. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రతి ఇంటికీ నెట్ సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు ఆయా పంచాయతీల్లో అవసరమైన సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడవన్నీ మూలకు చేరాయి. ఫైబర్ వైర్లు తెగి, రోడ్లపైన వృథాగా పడి ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంలో సీన్ రివర్స్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు సిగ్నల్ అందించేందుకు ఏర్పాటు చేసిన ఫైబర్ వైర్ల నిర్వహణ గాలికి వదిలేశారు. ఎక్కడికక్కడ తెగిన వైర్లను అలానే విడిచిపెట్టారు. ఇటీవల సబ్బవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వంగలి సమీపంలోని జాతీయ మారిటైం యూనివర్సిటీ, పెట్రో యూనివర్సిటీలకు 11 కి.మీ. మేర విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు. ఆ సమయంలో ఆ లైన్ల పొడవునా 24ఎఫ్ ఫైబర్ కేబుళ్లు తెగిపడ్డాయి. బోడవరం రోడ్డు పొడవునా ఇదే పరిస్థితి. రూ.లక్షల విలువైన వైర్లు రోడ్డు పొడవునా నిరుపయోగంగా దర్శనమిస్తున్నారు. దీంతో ఆయా పంచాయతీలకు బీబీఎన్ఎల్ సేవలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. తెగిన వైర్లను రోడ్డుపై అలానే వదిలేయడంతో ఎప్పుడు, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ లేకే ఈ దుస్థితి

గతంలో హై ప్రయార్టీ మండలాలుగా అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం, అనకాపల్లి, బుచ్చయ్యపేట, కె.కోటపాడు, చీడికాడ, చోడవరం, వి.మాడుగుల, దేవరాపల్లి మండలాలను ఎంపిక చేశారు. విశాఖ జిల్లా అర్బన్ పరిధిలోని పద్మనాభం, భీమునిపట్నం, ఆనందపురం మండలాల్లో కూడా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వైర్లు వేసి పరికరాలను సిద్ధం చేసి సేవలను విస్తరించారు. తాజాగా వీటిలో చాలా మండలాల్లో ఇదే పరిస్థితి. కేబుల్ టీవీ ఆపరేటర్లు ప్రసారాలకు ఆటంకం ఏర్పడితే గంటల వ్యవధిలోనే సరిదిద్దుతారు. ఆ స్థాయిలో కూడా బీబీఎన్ఎల్ నిర్వహణ లేదు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలను అందించాల్సిన పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. లైన్ల నిర్వహణ కొరవడటమే ప్రాజెక్టు తిరోగమనానికి కారణమని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.



సబ్బవరం సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న పరికరాలు

పూర్తిగా ఆగిన సేవలు



స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లో పనిచేసే మేం బీబీఎన్ఎల్ సేవల ఆథరైజేషన్ తీసుకున్నాం. సచివాలయాలతోపాటు ఇళ్లకు సైతం ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ప్రభుత్వం మారినప్పటి నుంచి నెట్ సేవలకు తరచూ బ్రేక్ వస్తోంది. ప్రస్తుతం పూర్తిగా సేవలు నిలిచిపోయాయి. దీంతో మా వినియోగదారులు ప్రత్యామ్నాం చూసుకున్నారు.

– నంబారు దినేష్, గోపాల్‌నగర్ కాలనీ

నెట్ సేవలు పునరుద్ధరించాలి



ఈ కేబుల్ వైర్లు ఎక్కడ పడితే అక్కడే తెగిపోయి కనిపిస్తున్నాయి. దీనిపై ఎవరికి సమాచారం అందించాలో కూడా తెలియట్లేదు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలకూ వీటిని కనెక్ట్ చేశారు. ఇప్పుడు పట్టించుకోవడం మానేశారు. కేంద్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ అంతరాయం లేని ఇంటర్నెట్ సేవలు అందించాలి.

– ఎ.సతీష్, సబ్బవరం

కాలుష్య కారక ఫార్మా పరిశ్రమలపై చర్యలకు వినతి



డీఆర్వో దయానిధికి వినతి పత్రం అందిస్తున్న గనిశెట్టి

పరవాడ: చెరువులు, గెడ్డలు, కాలువల్లోకి రసాయన వ్యర్థాలను యథేచ్ఛగా విడుదల చేస్తున్న ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన అనకాపల్లి డీఆర్వో దయానిధిని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. మండలంలోని పరవాడ ఊర, పెద్ద చెరువులు, మొల్లోడి గెడ్డల్లోకి ఫార్మా పరిశ్రమల రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా విడిచిపెట్టడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. శుద్ధి చేయని వ్యర్థాల కారణంగా పెద్ద చెరువులో రైతులు పెంచుతున్న చేపలు మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముత్యాలమ్మపాలెం సముద్రంలోకి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలతో మత్స్య సంపదకు తీరని నష్టం వాటిల్లి, అక్కడి మత్స్యకార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యంతో తానాం, లంకెలపాలెం, పరవాడ, భర్నికం, సాలాపువానిపాలెం, గొర్లివానిపాలెం, బొద్దపువానిపాలెం గ్రామాల ప్రజలు అనారోగ్య సమస్యలతో అల్లాడుతున్నారని నివేదించారు. కాలుష్య నియంత్రణ చర్యలతో పాటు, శుద్ధి చేయని వ్యర్థాలను జలాశయాల్లోకి విడుదల చేయకుండా నియంత్రించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో గనిశెట్టి కోరారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- పల్లెపండగలో ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి బాటలో నడుపుతామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పల్లె పండగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పెందుర్తి మండలం ముదపాక, గుర్రంపాలెం, వాలిమెరక, ఎస్ఆర్ పురం, గొరపల్లి, గవరపాలెం, కోట్నివానిపాలెం, పినగాడి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల్లో రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పంచాయతీ విధులపై రెండు రోజుల శిక్షణ

సబ్బవరం: మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు మెంబర్లు ఈ శిక్షణలో పాల్గొంటారని పేర్కొన్నారు. పంచాయతీ విధులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం, స్థానిక అభివృద్ధి పనులు, అకౌంట్ల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. మంగళ, బుధవారాల్లో రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భారీ గుంత.. వాహనదారుల చింత

పరవాడ: ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక సబ్ స్టేషన్ నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పడిన భారీ గుంత ప్రయాణికుల్ని భయపెడుతోంది. ఈ కూడలి మీదుగా వందల సంఖ్యలో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఫార్మాసిటీ, హిందూజా, ఎస్ఈజెడ్, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, విశాఖ, గాజువాక, స్టీల్‌ప్లాంట్, పరవాడ తదితర ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సబ్‌స్టేషన్ కూడలే ప్రధాన మార్గం. రాత్రి సమయంలో ఇళ్లకు చేరే హడావుడిలో ఉండే ప్రయాణికులకు ఈ భారీ గుంత ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏ మాత్రం వర్షం పడినా గుంతల్లో నీరు చేరి, దాని లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. సబ్‌స్టేషన్ నుంచి మండల కాంప్లెక్స్ వరకు పలు చోట్ల ఏర్పడిన గుంతల్ని పూడ్చేందుకు ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో ఏర్పడిన భారీ గుంత

సిండి'కేట్ల'కే మద్యం దుకాణాలు

సబ్బవరం: సబ్బవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం సిండికేట్ల ప్రయత్నాలు ఫలించాయి. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేస్తే రూ.2 లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ ఫీజులు చెల్లించుకోవాలి. దీన్ని సాధ్యమైనంత తక్కువకు పరిమితం చేసుకునేలా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. పార్టీలకతీతంగా ఒక్కటయ్యారు. అందరూ ఒకే తాటిపైకి వచ్చి, సాధ్యమైనన్ని తక్కువ దరఖాస్తులే దాఖలు చేశారు. సబ్బవరంలోని 8 మద్యం షాపులకు 226, పరవాడలోని 11 మద్యం షాపులకు 101 దరఖాస్తులే వచ్చాయి. ఇవి కూడా దాదాపు సిండికేట్ సభ్యులవే. సబ్బరం ఎక్సైజ్ పరిధిలో అన్ని షాపులూ వీరే దక్కించుకున్నట్లయింది. 16 నుంచి షాపులు తెరుచుకోనున్నాయి.

సబ్బవరం మండలం(8)

షాపు నంబర్	దక్కించుకున్నవారు
ఎకేపీ/16	బోకం శ్రావణ్‌కుమార్
ఏకేపీ/17	ఎం.శ్రీలత
ఏకేపీ/18	యాళ్ల గంగాభవాని
ఏకేపీ/19	గండి ముత్యాలనాయుడు
ఏకేపీ/20	కొటాన మోహన్‌కుమార్
ఏకేపీ/21	దొడ్డి శారద
ఏకేపీ/22	అవుగడ్డ భరద్వాజ
ఏకేపీ/23	పోలాకి కృష్ణ


పరవాడ మండలం(11)

ఏకేపీ/24	రొంగలి గోపాలకృష్ణ
ఏకేపీ/25	మర్రపు జయవర్ధిని
ఏకేపీ/26	పిల్లి శ్యామ్‌కుమార్
ఏకేపీ/27	వబ్బలరెడ్డి నూకరత్నం
ఏకేపీ/28	యనమల నందకిశోర్
ఏకేపీ/29	ఎస్.తేజేస్‌చరణ్
ఏకేపీ/30	ఎం.దేవప్రసాదరావు
ఏకేపీ/31	రాయవరపు తిరువెంకటేష్
ఏకేపీ/32	బయలపూడి వెంకట సత్య త్రినాథరావు
ఏకేపీ/33	రాయవరపు దేముడు
ఏకేపీ/34	ఇప్పా విజయభాస్కరరెడ్డి

కోనేరులో పడి వృద్ధుడి గల్లంతు



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ అసిరితాత



గల్లంతైన సన్యాసి(ఫైల్)

పెందుర్తి: మండలంలోని దువ్వపాలెం గ్రామం కోనేరులో ఓ వృద్ధుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన యర్ర సన్యాసి(65) సోమవారం ఉదయం బహిర్భూమికి సమీపంలో ఉన్న కోనేరు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో జారి పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ అసిరితాత ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సాయంతో సన్యాసి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. అర్ధరాత్రి వరకు ఎలాంటి ఫలితం కనిపించలేదు.

'కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి'

సబ్బవరం: కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సబ్బవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ లెక్చరర్స్ సోమవారం పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు తమ సమస్యలను ప్రభుత్వానికి నివేదించి, సానుకూల స్పందన కోసం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎన్ మూర్తికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎల్‌వీ రమణబాబు, ఎన్ శ్రీనివాసరావు, పీపీసీహెచ్ వరప్రసాద్, డి.అన్నపూర్ణ, రాణి, అంబేడ్కర్, జి.గిరిజ, పి.పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎన్ మూర్తికి వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

అసైన్డ్ భూముల్ని తిరిగి అప్పగించాలని వినతి

సబ్బవరం: ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిన అసైన్డ్ భూములను తిరిగి అప్పగించాలంటూ బంగారమ్మపాలేనికి చెందిన వంకర అర్జున కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు సీపీఎం నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన వంకర అమ్మతల్లికి ప్రభుత్వం 1954లో అసైన్డ్ భూములు పంపిణీ చేశారని, ఆ భూములు వంశపారంపర్యంగా తమకు దఖలుపడి ఉన్నట్లు తెలిపారు. బంగారమ్మపాలెం సర్వే నెం.70/6లో 2 ఎకరాలు, సర్వే నెం.70/22లో 0.05 సెంట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. తమ భూముల్ని అదే గ్రామానికి చెందిన భూస్వాములు దాడి త్రిమూర్తులు, కన్నంనాయుడు, దాడి అప్పారావు, దాడి సూర్యనారాయణ, దాడి రాంబాబు, కోరుబిల్లి నూకరాజు తదితరులు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. సదరు భూముల్ని తిరిగి తమకు స్వాధీనం చేయాల్సిందిగా వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఉన్నారు.



తహసీల్దార్ చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న వంకర అర్జున, ఉప్పాడ సత్యవతి తదితరులు

జిల్లాలో రూ.214 కోట్లతో అభివృద్ధి పనులు

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణాదేవి

కశింకోట: అనకాపల్లి జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది రూ.214 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణాదేవి తెలిపారు. కశింకోటలోని అగ్రహారం వీధిలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2.70 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు సీఎం రమేష్ భూమి పూజ చేశారు. అనంతరం సభలో పీడీ అన్నపూర్ణాదేవి మాట్లాడుతూ పనులను వచ్చే ఏడాది సంక్రాంతికి పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఎం రమేష్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కశింకోటలో కల్యాణ మండపాల నిర్మాణం, అసంపూర్తి కల్యాణ మండపాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతాయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, సర్పంచ్ మంత్రి జయరజని, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, తెలుగు రైతు రాష్ట్ర నాయకుడు గొంతిన శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, టీడీపీ నాయకుడు ఉగ్గిన రమణమూర్తి, మహిళా ప్రతినిధి పి. కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీ రమేష్

రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు

కశింకోట మండలంలో ఈ ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వెదురుపర్తి, బయ్యవరం, విసన్నపేట, కశింకోట గ్రామాల్లో రూ.2.77 కోట్లతో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న సిమెంట్, తారు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

పోర్టు హాస్పిటల్ పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీయే సొంతంగా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మసేన్, హెచ్ఎంఎస్ నాయకుడు మంగనాయుడు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గొర్లె చందు, సీఎఫ్‌టీయూ నాయకుడు మూర్తి, బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఏటా కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. కార్మికుల కష్టాలతోనే వేల కోట్లు సంపాదించి ప్రస్తుతం వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేయాలనుకోవడం సరికాదన్నారు. మరో వందేళ్లకు సరిపోయే రిజర్వు ఫండ్స్ పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ఆస్పత్రిని ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని ఆరోపించారు. రామలింగేశ్వర్రావు, శంకర్రావు, నాయుడు, రాఘవులు, రమణ, పోతన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జింక్ ఓల్డ్ క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకున్నట్లు గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. వైట్ అండ్ గ్రే కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, గ్రే కలర్ ఆఫ్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 7675022534 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

దాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన పర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి